క్లుప్తంగా

ముద్రగడను కలిసిన నాయకులు



ముద్రగడతో ఉంగుటూరు నాయకులు

ఉంగుటూరు: మాజీ మంత్రి, కాపు ఉద్యమ నాయకుడు ముద్రగడ పద్మనాభాన్ని ఉంగుటూరు మండల వైఎస్సార్‌ సీపీ కాపు నాయకులు గురువారం కిర్లంపూడిలో ఆయన స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా ముద్రగడ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీను గెలిపించేందుకు అందరూ శ్రమించాలని, అలాగే పుప్పాల వాసుబాబును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ముద్రగడను కలిసిన వారిలో పుప్పాలగోపి, పుత్సకాయల విష్ణుమూర్తి, మట్ట మరళి, గౌతు రాము, పైడిముక్కల రామకృష్ణ, బాదరాల సుబ్రహమణ్యం, శానంసత్యనారాయణ, మట్ట దుర్గారావు తదితరులు ఉన్నారు.

బ్లడ్‌ గ్రూప్స్‌పై అవగాహన



బ్లడ్‌ గ్రూప్‌ పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉంగుటూరు: మండలంలోని నారాయణపురం అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం విద్యార్థులు బ్లడ్‌ గ్రూప్స్‌, రక్తదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల రెడ్‌ రిబ్బన్‌ క్లబ్‌, ఎన్‌ఎస్‌ఎస్‌ , చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ టీకే విశ్వేశ్వరావు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణంలో విద్యార్థులు భాగం కావాలని పిలుపునిచ్చారు. చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది ఆర్‌.పార్థసారథి, హెల్త్‌ అసిస్టెంటు పి.అంజలి, మెడికల్‌ ల్యాబ్‌ టెక్నీషియన్‌ ఎన్‌.సూర్యకుమారి తదితరులు విద్యార్థులకు బ్లడ్‌ గ్రూప్స్‌ పరీక్షలు చేశారు.

పాత నేరస్తుల బైండోవర్‌



పాత నేరస్తులను, రౌడీలను బైండోవర్‌ చేస్తున్న తహసీల్దార్‌ సూర్యప్రభ

పెదవేగి: ఎన్నికల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకుంటామని పెదవేగి తహసీల్దార్‌ సూర్యప్రభ హెచ్చరించారు. గురువారం రాత్రి పెదవేగి తహసీల్దార్‌ కార్యాలయంలో కొప్పాక, న్యాయంపల్లి, పెదవేగి గ్రామాల్లో గత ఎన్నికల్లో కేసులు నమోదైన పాత నేరస్తులను, రౌడీలను పోలీసుల ఆధ్వర్యంలో తహసీల్దార్‌ బైండోవర్‌ చేశారు. అనంతరం తహసీల్దార్‌ సూర్యప్రభ మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి గొడవలకు పాల్పడినా లక్ష రూపాయల జరిమానా రెండు నెలలు జైలు శిక్ష విధిస్తామని బైండోవర్‌ చేసిన వ్యక్తులను ఆమె హెచ్చరించారు.

అభిమన్యుడు కుటుంబానికి పరామర్శ



జల్లూరి నరసమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు: చెట్టున్నపాడు వైఎస్సార్‌ సీపీ నేత జల్లూరి అభిమన్యుడు తల్లి జల్లూరి నరసమ్మ (76) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అభిమన్యుడు ఇంటికెళ్లి నరసమ్మ మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఆమె మృతి కుటుంబానికి తీరని లోటని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ రావిపాటి సత్యశ్రీనివాస్‌, జిల్లా కార్యవర్గ సభ్యుడు తుమ్మగుంట రంగ, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

నేడు అంజన్న హుండీ ఆదాయం లెక్కింపు

పెదపాడు: మండలంలోని అప్పనవీడులో అభయాంజనేయస్వామి హుండీ ఆదాయాన్ని శుక్రవారం లెక్కిస్తున్నట్లు ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాస్‌ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 9 గంటలకు లెక్కింపు ప్రారంభమవుతుందని చెప్పారు. ఆసక్తిగల ఉన్న భక్తులు హుండీ ఆదాయం లెక్కింపులో పాల్గొనవచ్చని చెప్పారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు గురువారం రూ.1,00,000 విరాళంగా అందజేశారు. విజయవాడలోని యనమలకుదురుకు చెందిన వెలగపూడి నాగేంద్ర సాయి హర్ష ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు.

వ్యవసాయ విజ్ఞానాన్ని రైతులతో పంచుకోవాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డీఏవో షేక్‌ హబీబ్‌ భాషా



హాజరైన నాలుగు మండలాల వీఏఏలు, డిజిటల్‌ అసిస్టెంట్లు

భీమడోలు: వ్యవసాయ విజ్ఞానాన్ని రైతులతో పంచుకోవాల్సిన బాధ్యత గ్రామ వ్యవసాయ సహాయకులదేనని జిల్లా వ్యవసాయాధికారి షేక్‌ హబీబ్‌ బాషా అన్నారు. భీమడోలు ఎంపీపీ సమావేశ మందిరంలో గురువారం సాయంత్రం భీమడోలు సబ్‌ డివిజన్‌ పరిధిలోని భీమడోలు, ద్వారకాతిరుమల, ఉంగుటూరు, నిడమర్రు మండలాల్లోని గ్రామ వ్యవసాయం సహాయకులు, డిజిటల్‌ అసిస్టెంట్లకు వ్యవసాయ సంబంధిత కార్యక్రమాలు, వాటి పురోగతి, వ్యవసాయంలో మెలకువలు, ఎన్నికల కోడ్‌ అమలు తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. ఏడీఏ డాక్టర్‌ పి ఉషారాజకుమారి అధ్యక్షతన నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు మండలాల్లోని పలు సొసైటీ ద్వారా సార్వా సీజన్‌లో ధాన్యం విక్రయాలు జరిగి, వారి ఖాతాల్లో నగదు జమ అయ్యాయని, అయినప్పటికీ ఇంకా రైతుల బయోమెట్రిక్‌ ఆథంటికేషన్‌ తీసుకోవడంలో నిర్లక్ష్యం ఏంటి అని వ్యవసాయ సహాయకులను ప్రశ్నించారు. వెంటనే ఆ ప్రక్రియను పూర్తి చేయాల్సిన బాధ్యత ఏఓలపై ఉందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువుల విక్రయాలు జరిగినా లక్షలాది రూపాయల సొమ్ములు నేటికి మార్క్‌ఫెడ్‌కు జమ చేయకపోవడంతో ఆయన వారిని ప్రశ్నించారు. రెండు, మూడు రోజుల్లో సొమ్ములను జమ చేయాలని, లేని పక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం డీఏఓ షేక్‌ హబీబ్‌ బాషా మాట్లాడుతూ వ్యవసాయాధికారులు, సిబ్బంది కాలానుగుణంగా నిరంతర విద్యార్థులు మారి వ్యవసాయంలో వస్తున్న సాంకేతిక మార్పులు, మెలకువలు వంటి ఇతర అంశాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. రైతులకు సేవ చేసే భాగ్యం సిబ్బందికి దక్కుతుందన్నారు. ఇదే క్రమంలో వివిధ పంటలు, అధునాతన సాగు విధానాలు, వాటిపై ఆశించే చీడపీడలు పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. వ్యవసాయంలో పురుగు మందుల వినియోగాన్ని తగ్గించాలని, సేంద్రియ వ్యవసాయంపై దృష్టిని సారించేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. రైతులు పురుగు మందులకు అధిక ఖర్చులు చేస్తున్నారని, ఆ విధానానికి స్వస్తి పలికేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఎన్నికల కోడ్‌ అమలులో ఉన్నందున వీఏఏలు రైతు భరోసా కేంద్రాల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా సాంకేతిక అధికారులు గౌస్‌ భాషా, ప్రవీణ్‌లు రైతు భరోసా కేంద్రాల ద్వారా అమలు చేస్తున్న పలు పథకాల అమలు, పరిష్కారం కాని సమస్యలను డీఏఓ దృష్టికి తీసుకుని వెళ్లారు.ఈ కార్యక్రమంలో భీమడోలు, ఉంగుటూరు ఏఓలు డాక్టర్‌ ఎస్‌పీవీ ఉషారాణి, బి.వెంకటేష్‌ తదితరులు పాల్గొన్నారు.

సంతోషిమాత ఆలయం ప్రారంభం



ఎమ్మెల్యే వాసుబాబును సత్కరిస్తున్న దృశ్యం

గణపవరం: ప్రజలలో ఆధ్యాత్మిక భావన కలిగితే సమాజం శాంతి సౌభాగ్యాలతో వికసిస్తుందని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గణపవరం పట్టణంలోని చినరామచంద్రపురంలో నీలం నర్సింహమూర్తి, నాగమణి దంపతుల ఆధ్వర్యంలో భక్తుల విరాళాలతో నూతనంగా నిర్మించిన సంతోషిమాత ఆలయం ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలు మూడు రోజులపాటు వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. గురువారం అమ్మవారిని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ దండు రాము, వైఎస్సార్‌ సీపీ నాయకులు కాకర్ల శ్రీను, కొండేటి వెంకటరత్నం, టాక్సీ రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట

భీమడోలు: ప్రజా సంక్షేమానికి వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం పెద్ద పీట వేసిందని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి పుప్పాల కార్తీక్‌, డీసీసీబీ డైరెక్టర్‌ కందులపాటి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పూళ్లలో మేము సిద్ధం–మాఊరు సిద్ధం కార్యక్రమంలో భాగంగా గురువారం సాయంత్రం వినాయకుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గ్రామంలోని హైస్కూల్‌, వెలమపేట, బావి వీధి ఏరియాల్లో విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంలో మీ కుటుంబానికి న్యాయం జరిగితేనే ఓట్లు వేయండంటూ ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ రావిపాటి సత్యశ్రీనివాస్‌, సర్పంచ్‌ దాయం సుజాత ప్రసాద్‌, ఎంపీటీసీ సభ్యులు గొండు కృష్ణ చైతన్య, గంటా శ్రీనివాసరావు, మండల యూత్‌ కన్వీనర్‌ మద్దుల రాజా, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పచ్చా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



భీమడోలు: పూళ్లలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌ సీపీ నాయకులు

కొత్తపల్లిలో...

దెందులూరు: గోపన్నపాలెం శివారు కొత్తపల్లి గ్రామంలో నేను సిద్ధం–మా ఊరు సిద్ధం కార్యక్రమం గురువారం రాత్రి నిర్వహ/ంచారు. సర్పంచ్‌ కోటే నాగమల్లేశ్వరి కుమార్‌, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఏనుగు రామాంజనేయులు ఆధ్వర్యంలో వైఎస్సార్‌ సీపీ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ఇంటింటికి వెళ్లి వివరించారు. రానున్న అసెంబ్లీ, పార్లమెంట్‌ ఎన్నికల్లో రెండు ఓట్లను ఫ్యాన్‌ గుర్తుకు వేసి జగనన్న ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సువ్వా ప్రభుదాసు, ఏనుగు అంజలి ప్రసాద్‌, నాయకులు, కొండేటి గంగాధరబాబు, తోట పద్మారావు, మాగంటి కృష్ణమోహన్‌, వీరంకి సత్యనారాయణ, మోర్ల సుబ్బారావు పాల్గొన్నారు.



కొత్తపల్లిలో నేను సిద్ధం- మా ఊరు సిద్ధం కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు

పెదపాడులో..

పెదపాడు: పేదల పక్షపాతి వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు కార్యకర్తలంతా సిద్ధంగా ఉండాలని పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్‌ తెలిపారు. పెదపాడు గ్రామంలోని రామచంద్రపురం గ్రామంలో నేను సిద్ధం–మా ఊరు సిద్ధం కార్యక్రమం నిర్వహించారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చడంతో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్‌ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా అబ్బయ్యచౌదరిని, ఎంపీ అభ్యర్థిగా కారుమూరు సునీల్‌కుమార్‌ యాదవ్‌ను గెలిపించాలన్నారు. ఉప సర్పంచ్‌ చేపేని కృష్ణ, వార్డు మెంబరు మార్ని నాగేంద్ర, సచివాలయ కన్వీనర్‌ రెళ్ల రమణ, సంగాపు తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.



రామచంద్రపురంలో ప్రభుత్వ లబ్ధిని వివరిస్తున్న అక్కినేని రాజశేఖర్‌

వంతెన నిర్మాణ పనుల పరిశీలన



గుండుగొలను వంతెన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: జాతీయ రహదారిపై గోదావరి కాల్వపై గుండుగొలను వంతెన నిర్మాణం పనులు వేగవంతం కావాలని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. గురువారం గుండుగొలను వద్ద గోదావరి కాల్వపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. ఫోన్‌లో నేషనల్‌ హైవే అథారిటీ ఆఫ్‌ ఇండియా అధికారులతో మాట్లాడి ప్రగతిని అడిగి తెలుసుకుని, నిర్మాణ పనులు వేగవంతం కావాలని సూచించారు. ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ రూ.4.2 కోట్లతో భీమడోలు, దెందులూరు మండలాల ప్రజలకు పూర్తి స్థాయిలో ఉపయోగపడేలా వారి ప్రయాణఅవసరాలకు ఇబ్బంది లేకుండా పూర్తిస్థాయి నాణ్యతా ప్రమాణాలతో వంతెన నిర్మాణ పనులు పూర్తి అవుతాయన్నారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ సభ్యురాలు నిట్టా లీలానవకాంతం గంగరాజు, వైఎస్సార్‌ సీపీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, సీతంపేట సర్పంచ్‌ పరసా లక్ష్మి సుజాత కనకరాజు, పార్టీ కమిటీ అధ్యక్షులు కోటిపల్లి సురేష్‌ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతుల వెల్లువ

పెదవేగి: దెందులూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి వినతులు వెల్లువెత్తాయి. గురువారం పెదవేగి మండలం కొండలరావుపాలెం ఎమ్మెల్యే క్యాంప్‌ కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అబ్బయ్యచౌదరి వినతులు స్వీకరించి, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో సమస్యను చెప్పిన వెంటనే సత్వరం పరిష్కరించిన ఎమ్మెల్యేకు ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



భీమడోలులో కవాతు చేస్తున్న పోలీసులు

భీమడోలు: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ట్రైనీ డీఎస్పీ బి.విద్యా అన్నారు. మోడల్‌ కోడ్‌ ఆఫ్‌ కాండక్ట్‌లో భాగంగా గురువారం సాయంత్రం డీఎస్పీ బి.విద్యా ఆధ్వర్యంలో సీఐ బీబీ రవికుమార్‌, ఎస్సై వై.సుధాకర్‌ సాయుధ దళాల సిబ్బది, పోలీస్‌ సిబ్బంది భీమడోలు, సూరప్పగూడెం గ్రామాల్లో ఫ్లాగ్‌ మార్చ్‌ను నిర్వహించారు. ఎన్నికల కోడ్‌ అమలులో ఉన్నందున ఎన్నికల నియమ నిబంధనలకు అనుసరించి ప్రతి ఒక్కరూ కార్యకలాపాలు సాగించాంటూ పురవీధుల్లో పోలీస్‌ కవాతు చేశారు. రాజ్యాంగబద్ధంగా ప్రజలకు కల్పించిన ఓటు హక్కును వారు నిర్భయంగా, నిస్పక్షపాతం వినియోగించుకోవాలన్నారు. గ్రామాల్లో రాజకీయ నాయకులు ఎన్నికల నిబంధనలు పాటించాలన్నారు. కోడ్‌ అమలులో ఉన్నందున ప్రతి విషయాన్ని గమనిస్తూనే ఉంటారన్నారు. సీఐ బీబీ రవికుమార్‌ మాట్లాడుతూ గ్రామాల్లో పోలీసుల నిఘా పెంచామన్నారు. ప్రతి ఒక్కరూ రూ.50 వేలకు మించి నగదును తీసుకెళ్లరాదని, రూ.10 వేలకు మించి గిఫ్ట్‌లను తమ వెంటనే తీసుకుని వెళ్లడం నేరమన్నారు. సరైన ఆధారాలతో వెళ్లాలన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలన్నారు.

పెదపాడులో..

పెదపాడు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళి అమలులో ఉన్నట్లు పెదపాడు ఎస్సై శుభశేఖర్‌ తెలిపారు. పెదపాడు మండలంలోని ఏపూరు గ్రామంలో ప్రజలకు అవగాహన నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును నిర్భయంగా పక్షపాతం లేకుండా ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ప్రశాంత వాతావరణంలో వినియోగించుకునేలా ఎన్నికల నిర్వహణకు అందరూ సహకారం అందించాలని కోరారు. తొలుత సీఆర్‌పీఎఫ్‌ సిబ్బందితో పోలీసు కవాతు నిర్వహించారు.

హెచ్‌సీ ప్రవీణ్‌కు పదోన్నతి



పీఎస్‌వీ ప్రవీణ్‌

పెదవేగి: స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తున్న పీఎస్‌వీ ప్రవీణ్‌కు ఏఎస్సైగా పదోన్నతి లభించింది. ఈ మేరకు గురువారం జిల్లా ఉన్నతాధికారుల నుంచి లిఖిత పూర్వక ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్సై రాజేంద్రప్రసాద్‌ తెలిపారు. మండల పరిధిలో కేసుల చేదనలో, ప్రజలకు తనదైన శైలిలో శాంతిభద్రతల పరిరక్షణలో అందించిన సేవలను గుర్తించి పదోన్నతి ఇచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన పీఎస్‌వీ ప్రవీణ్‌ను స్థానిక పోలీసులు, నాయకులు అభినందించారు.

వాహన తనిఖీలు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో గురువారం రాత్రి ట్రాఫిక్‌ పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. స్థానిక మసీదు సెంటర్‌లో ట్రాఫిక్‌ ఎస్సై రంగయ్య ఆధ్వర్యంలో ట్రాఫిక్‌ సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రంగయ్య మాట్లాడుతూ డీఎస్పీ యు.రవిచంద్ర ఆదేశాల మేరకు సీఐ పి.రాజేష్‌ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించామన్నారు. అలాగే హెల్మెట్‌ లేకుండా వాహనాలు నడిపే వారికి కౌన్సిలింగ్‌ ఇచ్చామన్నారు. మరోసారి హెల్మెట్‌ లేకుండా వాహనాలు నడుపుతూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు చెప్పారు.

‘నన్ను ఎవరూ కొట్టలేదు’



పిప్పర దుర్గా ప్రసాద్‌

దెందులూరు: వైఎస్సార్‌ సీపీ నాయకులు బీసీ యువకుడిపై దాడి చేశారని నియోజకవర్గ టీడీపీ నాయకత్వం ఆడిన డ్రామా బట్టబయలైంది. తిమ్మనగూడేనికి చెందిన దుర్గా ప్రసాద్‌ అనే యువకుడిని అడ్డం పెట్టుకుని వైఎస్సార్‌ సీపీ నాయకులు దాడి చేశారని దుర్గా ప్రసాద్‌ ముఖానికి బ్యాండేజీ వేసి ఆడిన నాటకం ముమ్మాటికి వట్టిదేనని స్వయంగా దుర్గాప్రసాద్‌ ఒప్పుకున్నాడు. తిమ్మన్నగూడెం గ్రామంలో జరిగిన గొడవలో తనను కామిరెడ్డి నాని కొట్టలేదని, ఈ గొడవలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరికి సంబంధం లేదని, తనకు ఎటువంటి గాయం కాలేదని తన ముఖాన్ని తిమ్మన్నగూడెం గ్రామస్తుడు పిప్పర దుర్గాప్రసాద్‌ చూపించాడు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తాను ఏ పార్టీకి చెందిన వ్యక్తిని కాదన్నారు. తిమ్మన్నగూడెం గ్రామంలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ప్రచారం చేసుకుని వెళ్లిపోయారని, టీడీపీ వాళ్ళు నన్ను వివాదంలోకి లాగవద్దని, ఇబ్బందులకు గురి చేయవద్దని కోరారు. పోలీస్‌ స్టేషన్‌లో ఎమ్మెల్యే అనుచరులపై నా పేరు మీద కేసు పెట్టిన సంగతి తనకు ఇప్పటి వరకు తెలియదన్నారు. తాను పోలీస్‌స్టేషన్‌లో తన పేరు మీద ఉన్న కేసును విత్‌ డ్రా చేసుకుంటానని దుర్గాప్రసాద్‌ వివరించారు.

టీడీపీ శ్రేణులు భయపడుతున్నాయి

దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరిని, వైఎస్సార్‌సీపీని చూసి టీడీపీలో అందరూ బెంబేలెత్తుతున్నారడానికి తిమ్మన్నగూడెం సంఘటన నిదర్శనమని వైఎస్సార్‌ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. గురువారం శ్రీరామవరంలో ఆయన మాట్లాడుతూ ఈ సంఘటనకు, తనకు ఏం సంబంధం లేకపోయినా టీడీపీ వాళ్లు చీప్‌ట్రిక్స్‌తో ఏదో రకంగా సానుభూతి పొందాలనే చేసే ప్రయత్నం అన్ని గ్రామాల్లో ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే ప్రచారానికి రాని ఇతర గ్రామాల్లోని ప్రజాప్రతినిధులపై సైతం కేసు పెట్టారని, సభకు రాకుండా ఉన్న వారిపై కేసు పెట్టడం బాధితుడు దుర్గాప్రసాద్‌ చేసింది కాదని ఇట్టే అర్థం అవుతుందన్నారు. సంబంధం లేని నాపై, పార్టీపై దుష్ప్రచారం చేయడం, ఇతర గ్రామాల్లోని ప్రజాప్రతినిధులపై కేసులు పెట్టడం దెందులూరు నియోజకవర్గంలో టీడీపీ నాయకులు భయపడుతున్న తీరును తెలియజేస్తుందన్నారు. ఇకనైనా టీడీపీ నాయకులు ఈ విధానాన్ని మార్చుకోవాలని కోరారు.

యాప్‌ ద్వారా ఎన్నికల ప్రచారానికి అనుమతి

ఏలూరు రూరల్‌: ఎన్నికల ప్రచారం కోసం రాజకీయ పార్టీలు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఏలూరు రిటర్నింగ్‌ అధికారి ఎం ముక్కంటి చెప్పారు. గురువారం ఏలూరు తహసీల్దార్‌ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రచారం చేసుకోవాలంటే ఆన్‌లైన్‌లో వివిధ యాప్‌ల ద్వారా ముందస్తు అనుమతి పొందాలన్నారు. ఎన్నికలు సజావుగా నిష్పక్షపాతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం యాప్‌ ద్వారా అనుమతి పొందడంపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా బూత్‌ల వద్ద పోలింగ్‌ సిబ్బందికి సహకరించాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్‌ వి మురార్జీ, అగ్నిమాపకశాఖ అధికారి వి ఆంజనేయులు, ఆర్‌టీఓ కె శ్రీహరి, కార్పొరేషన్‌ అధికారి ఎండీ సిరాజుద్దీన్‌ తదితరులు పాల్గొన్నారు.

మూల్యాంకన విధుల నుంచి మినహాయింపునివ్వాలి



డీఈఓ అబ్రహంకు వినతిపత్రం సమర్పిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో జరుగుతున్న 10వ తరగతి పబ్లిక్‌ పరీక్షలకు సంబంధించి విద్యార్థులు రాసిన జవాబుపత్రాల మూల్యాంకన త్వరలో చేపట్టనున్న నేపథ్యంలో అర్హులైన ఉపాధ్యాయులకు ఆ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని పీఆర్‌టీయూ జిల్లా నాయకులు గురువారం డీఈవో ఎస్‌.అబ్రహంకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల అంజనేయులు మాట్లాడుతూ తీవ్ర అనారోగ్య కారణాలతో బాధ పడుతున్న ఉపాధ్యాయులకు, 60 ఏళ్లు పైబడిన వారికి వయోభారం దృష్ట్యా, రంజాన్‌ ఉపవాస దీక్షల్లో ఉన్న ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని, అలాగే మినహాయింపు కోరుకునే వారు దరఖాస్తు చేసుకోవడానికి గడువు పెంచాలని కోరారు. అలాగే దివ్యాంగులు, బాలింతలు, గర్భిణీలకు సైతం మూల్యాంకన విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని, స్పెషల్‌ అసిస్టెంట్‌ల నియామకాల విషయంలో నాడు – నేడు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ఏకోపాధ్యాయ పాఠశాలలతో పాటు ఇద్దరు ఉపాధ్యాయులున్న పాఠశాలలకు మినహాయింపునిస్తూ, 8 కిలోమీటర్ల లోపు పాఠశాలల్లో పనిచేస్తున్న వారిని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని కోరారు. కాగా ఎన్నికల విధుల నుంచి మినహాయింపు కోరుతూ వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హత గల వారికి విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. డీఈఓను కలిసిన వారిలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ సుబ్బారావు, ఇతర నాయకులు ఉన్నారు.

అడవికొలను అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధం



సంకు సత్యకుమార్‌

నిడమర్రు: అడవికొలను అభివృద్ధిపై మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులుచేసిన వ్యాఖ్యలపై బహిరంగచర్చకు సిద్ధమని వైఎస్సార్‌ సీపీ మండల కన్వీనర్‌ సంకు సత్యకుమార్‌ సవాల్‌ చేశారు. టీడీపీ అధికారంలో ఉన్నపుడు అడవికొలనులో తాగునీరు, ప్రధానరహదారి సమస్యతో గ్రామ ప్రజలు అనేక ఇబ్బందులు పడేవారన్నారు. అధ్వానంగా ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డుకు నిర్మాణానికి ఉత్తుత్తి శంకుస్థాపనలుచేసి గన్ని వీరంజనేయు లు ప్రజలకు మోసగించారన్నారు. ప్రస్తుతం ఆ రహదారిని నిర్మించిన ఘనత ఎమ్మెల్యే వాసుబాబుదే అన్నారు. గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వంలో నిర్మించారన్నారు. గ్రామంలో టీడీపీ ప్రభుత్వంలో ఒక్క ఇంటి పట్టా ఇవ్వలేదని, అదే వైఎస్సార్‌సీపీ హయాంలో 287మంది పేదలకు ఇంటిపట్టాలు ఎమ్మెల్యే వాసుబాబు అందించారన్నారు. అడవికొలను అభివృద్ధి విషయంలో బహిరంగ చర్చకు సిద్ధంగా ఉంటే తేదీ ప్రకటించాలని చాలెంజ్‌ చేశారు.

డీఈవో ఆకస్మిక తనిఖీ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : జిల్లాలోని వివిధ మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలను జిల్లా విద్యాశాఖాదికారి ఎస్‌.అబ్రహం గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలోని ఉంగుటూరు, గణపవరం మండలాల్లోని గణపవరం, పిప్పర, అర్ధవరం జిల్లా పరిషత్‌ ఓరియంటల్‌ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేసినట్లు డీఈఓ కార్యాలయ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. గణపవరంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో నోట్‌బుక్స్‌ దిద్దని మ్యాథ్స్‌ టీచర్‌ని మందలించినట్లు పేర్కొన్నారు. అలాగే ఉంగుటూరు మండలం కైకరం జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు.